


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com



నిజామాబాద్
కామారెడ్డి

సోమవారం 15 డిసెంబర్ 2025 7 పేజీలు

# రెండో దశ పంచాయతీ
# పోలింగ్ ప్రశాంతం



## - ఉదయం 7 గంటల నుంచే ఓటర్ల రద్దీ
## - ఎన్నికల నిర్వహణలో అధికారుల జాగ్రత్తలు



**సూర్య ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా జరిగిన రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1 గంట వరకు సాగగా, అనంతరం క్యూలో నిలబడ్డ ఓటర్లు తన ఓటును వినియోగించుకునేలా రెండు గంటల పాటు అదనపు సమయం కల్పించారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు తెల్ల వారుజామునే కదలికతో కిక్కిరిశాయి. ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఉత్సాహంతో మహిళలు, వృద్ధులు కూడా భారీగా పాల్గొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడికక్కడ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు. (వివరాలు లోపలి పేజిల్లో)







# సీటు కోసం కోటి దండాలు

## - వినూత్న రీతిలో ప్రచారాలు

**సూర్య వేల్పూర్**

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ సీట్ కోసం అభ్యర్థులు కోటి దండాలు పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఒక్కో గ్రామంలో ఒక్కో విధంగా అభ్యర్థులు ప్రచారాలు కొనసాగించడం కొన్ని విస్తీపోయే సంఘటనలు కనిపిస్తున్నాయి. అయ్యో నవ్విపోదురు కాక అన్నట్టుగా అభ్యర్థుల తీరు కనబడుతుంది. అభ్యర్థులు గ్రామాల్లోని అభివృద్ధి కార్యక్రమాలను గ్రంథాలయాలను, సిమెంట్ రోడ్లను, వీధి దీపాలు, నీటి సమస్యను పరిష్కరిస్తామని పరిష్కరించని యెడల సర్పంచ్ పదవి నుండి తొలగించవచ్చని ప్రమాణాలు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో దేవాలయాల్లోకి వెళ్లి నేను అభివృద్ధి చేయనట్లయితే నేను సర్పంచ్ పదవి నుండి స్వచ్ఛందంగా తొలగిపోతానని దేవుడు గుడిలో ప్రమాణాలు చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో ఎన్నికల కోలాహలం జోరుగా కనిపిస్తుంది. గ్రామాల్లో ఇంటింటికి మాంసాన్ని



పంపిణీ చేస్తూ అలాగే లిక్కర్ కూడా జోరుగా అందజేస్తున్నారు .కొన్ని గ్రామాలలో యువకులంతా కలిసి అభివృద్ధి కార్యక్రమాలు రాసి ఇచ్చి ఇవి నెరవేర్చిన వారికి ఓట్లు వేస్తామని పకడ్బందీగా ప్రణాళిక వేసుకున్నారు. ఒక్కో గ్రామంలో ఇంతకు పూర్వమే ఎంపీటీసీ పోటీ చేసిన వారు గెలుపొంది మరల సర్పంచ్ సీట్ కోసం ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఓటర్ల మనసులో ఏముందో అనేది 17వ తేదీన డబ్బా విప్పితే గాని తెలియని పరిస్థితి ఉంది. గ్రామాలలో అందరూ అన్ని పార్టీల యొక్క పారితోషకాలు తీసుకుంటూ దేనికి ఓటు వేస్తారో తెలియని సందేహం అభ్యర్థుల్లో మదిలో ఉంది.కుల సంఘాలను తమ వైపు తిప్పుకోవడానికి సంఘ పెద్దలను బతిమాలుతూ మీ సంఘం(మిగతా 2లో)



## కంఠం గ్రామంలో
# అర్బన్ ఎమ్మెల్యే ప్రచారం

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి :**

ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండలంలోని కంఠం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఉంగరం



గుర్తు అజిగిరి సాయినాథ్ కి మద్దతుగా నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గ్రామంలో ఘనంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తన సమస్యలుగా తీసుకుని పనిచేసే సజ్జన నాయకుడు అజిగిరి సాయినాథ్ గారని ప్రశంసించారు. కంఠం గ్రామ సమగ్ర అభివృద్దే లక్ష్యంగా స్పష్టమైన దృష్టి, నిబద్ధత, కార్యాచరణతో ముందుకు సాగుతున్న నాయకుడు ఆయనేనని పేర్కొన్నారు. గ్రామంలో తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, మహిళల సంక్షేమం (మిగతా 2లో)

# దోచుకునే, దాచుకునే వాళ్లకు ఓటు వేయవద్దు

## -బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి

**సూర్య బాన్సువాడరూరల్.**

దోచుకునే, దాచుకునే వారికి ఓటు వేయవద్దని, గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించే వారికి ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈనెల 17న మూడో విడత పంచాయతీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో (మిగతా 2లో)



# చైనా మాంజా తయారీదారులకు హెచ్చరిక

**-చైనా మాంజా వలన ఎవరైనా వ్యక్తులకు ప్రాణహాని కలిగితే వారిపై హత్యా నేరం క్రింద కేసు నమోదు - పోలీస్ కమిషనర్ వెల్లడి**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలోని ప్రజలకు తెలియజేయునది ఏమనగా చైనా మాంజ వాడకం వలన ప్రజలకు, జంతువులకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉన్నది. ఈ చైనా మాంజా వలన ఎవరైనా వ్యక్తులకు ప్రాణహాని కలిగితే వారిపై హత్య నేరము క్రింద కేసు నమోదు చేయడం జరుగుతుందని నగర సిపి శ్రీ సాయి చైతన్య వెల్లడించారు కావున ఎవరైనా చైనా మాంజా నిలువ ఉంచిన , ఎవరైనా చైనా మాంజ తయారు చేసిన , ఎవరైనా చైనా మాంజా అమ్మిన లేదా అమ్మడానికి ఎవరైనా ప్రోత్సహించిన వారిపై చట్ట ప్రకారము చర్యలు తీసుకొనబడును. కావున కొంతమంది ఇప్పటికే హైదరాబాదు నుండి నిజామాబాదుకు చైనా మాంజా తరలించినట్లు పోలీసులకు సమాచారం ఉన్నది. అట్టి చైనా మాంజా సంబంధిత పోలీస్ స్టేషన్ యందు అప్పగించగలరు లేదా కాల్చి వేయగలరు. ఎవరైనా బయటపడేసినట్లయితే ప్రజలకు మరియు జంతువులకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉన్నది . ఎవరైనా ఇట్టి చైనా మాంజా విక్రయించిన , అట్టి మాంజాతో ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే విక్రయ దారులు కూడా అట్టి కేసుకు బాధ్యత వహించాల్సి ఉంటుంది.కాబట్టి పైన తెలియజేయబడిన టువంటి సూచనలకు విరుద్ధంగా ఎవరైనా చైనా మాంజా నిలువ చేసిన , అమ్మిన వారిపై చట్ట ప్రకారము చర్యలు తీసుకొనబడును. ఎవరి వద్దనైనా అట్టి చైనా మాంజా ఉన్నట్లయితే వారు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ యందు అప్పగించగలరు. లేనియెడల చైనా మాంజా ఎవరైనా ఉపయోగిస్తున్నట్లు సమాచారం తెలిసినట్లయితే తమ దగ్గరలోని పోలీస్ స్టేషన్ నందు తెలియజేయగలరు లేదా డయల్ 100 కు కాల్ చేయగలరు. సమాచారం ఇచ్చినటు వంటి వారి వివరాలు గోప్యముగా ఉంచబడును.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ - రాజేష్ చంద్ర

**సూర్య, నాగిరెడ్డిపేట్**



మండలంలో జరుగుతున్న రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా ఆదివారం మండలంలోని జలాల్ పూర్, తాండూర్, నాగిరెడ్డిపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది విధులు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలపై ఎస్పీ అధికారులతో సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి ఫలితాల వెల్లడి ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## నిరుపేద ఆడబిడ్డలకు ఆర్థిక సహాయం చేస్తా

**సూర్య,భీమ్‌గల్:**



తను సర్పంచ్ గా గెలిస్తే నిరుపేద ఆడబిడ్డల పెళ్లికి తన వంతుగా 10000 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానని పురాణిపేట్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి సుంకరి లక్ష్మి గాంధీ అన్నారు.శనివారం పురాణిపేట్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికై అనునిత్యం అందుబాటులో ఉంటూ...గట్టి సంకల్పంతో మీ ముందుకు వస్తున్నానని అన్నారు. గ్రామ ప్రజలు, పెద్దలు, అన్నదమ్ములు, అక్క చెల్లెల్లు, యువత, మిత్రులు, శ్రేయోభిలాషులు అందరూ ఆశీర్వదించాలని కోరారు. గ్రామ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజలు ఇచ్చే విశ్వాసం, మద్దతుతో గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పురాణిపేట్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ గా బలపరిచిన తనకు సర్పంచ్ గా అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామ ప్రజలతో కలిసి గ్రామ అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ గ్రామంలో సర్పంచ్ గా గెలిచిన వెంటనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తానని, అంగన్వాడి బిల్డింగ్ నిర్మాణం, విలేజ్ హెల్త్ సెంటర్ నిర్మాణం చేయించడం జరుగుతుందన్నారు. గ్రామంలో కుల మతాలకు అతీతంగా ఆడబిడ్డ పుట్టగానే 5000, రూపాయలను వ్యక్తిగతం గా ఫిక్స్ డిపాజిట్ చేస్తానని తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా నీటి సమస్య పరిష్కారం, విద్యుత్ సమస్యపై దృష్టి సారించడం జరుగుతుందన్నారు. సమస్యల పరిష్కారం కొరకు నిరంతర కృషి చేస్తానని ప్రజలకు హామీ. గత ప్రభుత్వ హయాంలో వస్తున్న మిషన్ భగీరథ వాటర్ పూర్తిగా రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు గెలిపించిన వెంటనే మిషన్ భగీరథ నీటిని కూడా పరిష్కరిస్తానని హామీ,మీ అమూల్యమైన ఓటు లేడీ పర్సు గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## ప్రభుత్వం సహకారంతో మరింత అభివృద్ధి

**సూర్య,భీమ్‌గల్**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకా రంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని కుంట లక్ష్మి రమేష్ అన్నారు. ఆదివారం మండలంలో మెండోరా గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గా తాను సర్పంచ్ గా పోటీలో ఉన్నానని తెలిపారు. తన గుర్తు ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. గతంలో తాను సాధారణ వ్యక్తి గా గ్రామం లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిం చడం జరిగిందని తెలిపారు. గ్రామం లో ఇప్పటికే ఎంతో మంది అర్హులకు రేషన్ కార్డు లు ఇప్పించడం ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకో వడం జరిగిందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కొరకు ఇప్పటికే ఎన్నో నిధులు సాధించానని, సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగాలలో ఇంకా అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. గ్రామంలో నీటి సమస్య, మురికి కాలువల నిర్మాణం, సీసీ రోడ్లతో పాటు ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తానని అన్నారు. తనను గెలిపిస్తే నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తా తప్పా తన స్వార్థం కొరకు మాత్రం పని చెయ్యనని తెలిపారు. తనను ఆదరించి గెలిపించాలని కోరారు.

## మల్లికార్జున స్వామి కళ్యాణం లో భాగంగా గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు

**సూర్య కామారెడ్డి టౌన్**



కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆదివా రం గ్రామదేవతలకు కొబ్బరికా యలు కొట్టే కార్యక్రమాన్ని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవునిపల్లిలోని హనుమాన్, ఊరడమ్మ, పోచమ్మ, మైసమ్మ, బీరప్ప దేవదేవుల్లకు కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా VDC అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గూడెల్లి గంగారాం, ద్యావరి నవీన్ లు మాట్లాడుతూ.. ప్రతి ఏటా మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గ్రామ దేవతలకు డప్పు చప్పుళ్ళ మధ్య కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలను ఏళ్ల వేళల కాపాడే గ్రామదేవతలకు ప్రసన్నం చేసుకొని, మల్లికార్జున కళ్యాణోత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని కోరుకున్నట్లు తెలిపారు. సోమవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం అగ్నిగు ండాల కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ మేరకు ఆదివారం రాత్రి అగ్ని గుండాల కోసం సిద్ధం చేయనున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు డా.వంగ రాహుల్ కుమార్, నిట్టు లింగారావు, సహాయ కార్యదర్శి మీసాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు పెద్దోళ్ల శశిధర్ రావు, ఒగ్గు నర్సింలు, బోడోల్ల రాజేందర్, దండు నందివర్ధన్, ఎరుకల బాలమణి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామాభివృది కోసం కృషి చేస్తా

**సూర్య,భీమ్‌గల్**



తనను సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని పల్లికొండ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన మారి పెద్ది మీనాగణేష్ అన్నారు. ఆదివారం పల్లికొండ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. పల్లికొం డ సర్పంచ్ గా గెలిపించి గ్రామాన్ని అన్ని రకాలుగా అభి వృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. తనకు ఎన్నికల అధికారులు కేటాయించిన ఫుట్ బాల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. గ్రామం లో నీటి సమస్య, విద్యార్థులకు లైబ్రరీ ఏర్పాటు, వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం చేస్తానని పేర్కొన్నారు. మహిళలకు కావాల్సిన అన్ని సౌక ర్యాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. మహిళగా ప్రజలకు అందుబా టులో ఉండి సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. మహిళల సమస్యల పరిష్కారం కొరకు అందుబాటులో ఉండి సేవచేస్తానని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు, యువకులు, పాల్గొన్నారు.

## సర్పంచ్ ఉప సర్పంచ్ లకు ఘన సన్మానం

**సూర్య కామారెడ్డి**



కామారెడ్డి మండలంలోని గర్గుల్ గ్రామంలో ఆదివారం రోజున సర్పంచ్ ఉప సర్పంచ్ లకు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎల్లమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన టువంటి కార్యక్రమంలో నూతనంగా గర్గుల్ గ్రామానికి ఎన్నికైన సర్పంచ్ రవితేజ గౌడ్ ఉప సర్పంచ్ ప్రవీణ్ లతోపాటు వార్డ్ మెంబర్లను స్వామి శ్రీనివాస్ నిమ్మ ఎల్లవ్వ సిహెచ్ అనూష టాప్ లింబవ స్వామి లను ఘనంగా సన్మానం చేయడం జరిగిందని స్థానిక గోడ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు కార్యదర్శులు సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సదాశివ నగర్ లో పర్యటించిన బిజెపి రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లాలో సదాశివనగర్ మండల క్రేంద్రం తో పాటు మార్కల్ గ్రామం అడ్లుర్ ఎల్లారెడ్డి కుప్రియాల్, గ్రామంలో నూతనంగా ఎన్నుకోబడ్డ సర్పంచ్, ఉప సర్పంచ్,వార్డ్ మెంబెర్స్ సభ్యులను మర్యాద పూర్వకంగా తమ గ్రామంలో వెళ్ళి కలిసి విజయం సాధించినందుకు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయం సాధించిన సర్పంచ్లు ఉప సర్పంచ్లు వార్డు సభ్యులు రాబోయే కాలంలో తెలంగాణలో కూడా రాష్ట్ర ప్రభుత్వం బిజెపి ఏర్పడుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ కష్టపడి బిజెపి చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. రాబోయే కాలంలో ఎంపీటీసీ జెడ్పిటిసి స్థానాలలో కూడా బిజెపిని బలపరచాలని ఆయన సూచించారు. విజయం సాధించిన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపి షాలువుతో సత్కరించిన బిజెపి రాష్ట్ర నాయకులు డా౹౹ పైడి ఎల్లారెడ్డి , వారితో పాటు గ్రామ పెద్దలు మరియు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో గోల్డ్ జిమ్ ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**





కామారెడ్డి పట్టణంలో ఆదివారం రోజున గోల్డ్ జిమ్ ను ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకామారెడ్డి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోల్డ్ జిమ్‌ను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, క్రీడాకారులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే క్రీడలు, వ్యాయామం ఎంతో అవసరమని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో ఇటువంటి జిమ్‌లు ఏర్పాటు కావడం యువతకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణ యువతకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు తన పూర్తి సహకారం అందిస్తానని షబ్బీర్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున యువకులతో పాటు జిమ్ నిర్వాహకులు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లమడుగును కలిసిన బొంపల్లి
# గ్రామపంచాయతీ పాలకవర్గం

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గం సభ్యులు మాజీ జడ్పీటీసీ రాజేశ్వరరావు అధ్వర్యంలో మాజీ యంయల్ఏ జాజాల సురేందర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ యంయల్ఏ జాజాల సురేందర్ నూతన సర్పంచ్ గైని శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాజయ్య, వార్డు సభ్యురాలు రజితసుమన్, వార్డు సభ్యులు రాజమణి రమేష్, గడీల లతదత్తురావు, మొగ్గం సాయిలు లకు శాలువాలతో సన్మానించారు.. ఈ సందర్భంగా మాజీ యంయల్ఏ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తో పాటు మాజీ యంపీపీ అనసూయ రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు దత్తు రావు, పడిగెల విఠల్‌రావ్, కిషన్‌రావ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డి పేట లో 88.69 శాతం పోలింగ్ నమోదు

**సూర్య , నాగిరెడ్డిపేట్**



మండలంలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 88.69 శాతం పోలింగ్ నమోదైనట్లు ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలో ఆరు గ్రామ పంచాయతీలలో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడగా, 21 గ్రామపంచాయతీలలో 21 వేల 994 మంది ఓటర్లకు గాను 9 వేల 209 పురుషులు, 10 వేల 297 మంది మహిళలు, మొత్తం 19 వేల 506 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన తెలిపారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాలి

**సూర్య వేల్పూర్**




ఈనెల 17వ తేదీన జరిగే స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులే కాకుండా ఓటర్లు కూడా ఎన్నికల నిబంధనలను పాటించాలని ఎస్సై సంజీవ్ తెలిపారు. పోలింగ్ బూత్ లోకి ఎన్నికల నియమావళి ప్రకారం ఇంకు బాటిల్ ,వాటర్ బాటిల్ ,స్మార్ట్ వాచ్, సెల్ ఫోన్, అగ్గిపెట్టెలు, తీసుకెళ్లకూడదని దీనికి ప్రతి ఒక్కరు గమనించవలసి ఉంటుందని అన్నారు. నిబంధన లు ఊల్లంగించినట్లైతే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కావున ప్రతి ఒక్కరూ ఇట్టి విషయాన్ని గమనించాలని కోరారు.

## ప్రచారంలో వేగం పెంచిన పసుపుల సాయిలు

**సూర్య బాన్సువాడ రూరల్**



బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్న పసుపుల సాయిలు ఎన్నికల ప్రచారంలో వేగంపెంచారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన విద్యావంతుడిగా, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గ్రామస్థుల్లో మంచి ఆదరణ పొందుతున్నారు. ఆదివారం పసుపుల సాయిలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ గ్రామ ఓటర్లను నేరుగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ, జరగబోయే ఎన్నికల్లో లేడీస్ పర్స్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను కోరారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, సంక్షేమ పథకాల అమలు పై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో యువకులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపుల సాయిలుకు మద్దతుగా ఆయన వెంట నడుస్తూ ప్రచారం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామాభివృద్ధిపై స్పష్టమైన దృష్టితో ముం దుకు సాగుతున్న పసుపుల సాయిలు ప్రచారం ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది మరింత ఉత్సాహంగా, వేగంగా ముందుకు కదులుతుంది

## ప్రజాశాంతి భద్రతల నిర్వహణ కోసం ఆంక్షలు

**సూర్య వేల్పూర్**



ఈనెల 17వ తేదీ న ఆర్మూర్ డివిజన్ లో వేల్పూర్ మండలం లోని ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి వేల్పూర్ మండలంలో 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 15వ తేదీ నుండి అమలు లో ఉంటుందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఒక ప్రకటనను ఎస్ఐ సంజీవ్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని ఐదు మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు గుమికూడ వద్దని ఇందుమూలంగా తెలియపరిచారు. సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే చట్టబద్ధమైన సమావేశాన్ని నిర్వహించాలని తెలిపారు. ఇట్టి ఉత్తర్వులు 15వ తేదీ ఉదయం 5 గంటల నుండి 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అమలులో ఉంటుందని తెలిపారు. పైన పేర్కొన్న ఆదేశాలను ఉల్లంఘించే ఏ వ్యక్తి అయినా చట్టప్రకారం చర్యలుతీసు కోబడతాయని పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య ఐపీఎస్ తెలియజేయడం జరిగిందన్నారు.

## నూతన పాలకవర్గానికి
## అభినందనలు తెలిపిన అనిల్ పటేల్

**సూర్య రాజంపేట**



రాజంపేట మండల కేంద్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ దుబ్బని శ్రీకాంత్, ఉప సర్పంచ్ ఇమ్రాన్ , వార్డు సభ్యులుగా గెలిచిన నూతన పాలక వర్గానికి రాజంపేట ప్రజా రాజాధికార పార్టీ మండల అధ్యక్షుడు అనిల్ పటేల్ ఆదివారం అభినందనలు తెలుపుతూ అనంతరం మాట్లాడుతూ.. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజల సమస్యల పరిష్కారానికి పాలకవర్గం నిరంతరం కృషి చెయ్యాలని వారికి ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## శ్రీమద్భగవద్గీత సప్తాహ ప్రవచనం...
# సనాతన ధర్మం - భక్తి మార్గం


**సూర్య కామారెడ్డి టౌన్.**




కామారెడ్డి పాత సాయిబాబా గుడి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ మద్ భగవద్గీత సప్తహ ప్రవచనములో భాగంగా ఆదివారం రోజున బ్రహ్మాండంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద మొత్తంలో భక్తులు హాజరై భక్తులను ఉద్దేశించి ప్రత్యేకంగా శ్రీమద్భవద్గీత సప్తాహ ప్రవచనంలో మూడవ రోజున పూజ్యులు బ్రహ్మశ్రీ గురువుగారు భగవద్గీతలోని ముఖ్య ప్రవచనాలు భక్తులకు ఉపదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కోశాధికారి కమిటీ సభ్యులు భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వీరన్న గుట్ట సర్పంచ్ కాంగ్రెస్ లో చేరిక

**సూర్య రెంజల్**



మండలంలోని వీరన్న గుట్ట గ్రామ సర్పంచ్ ఇటీవల స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపొందినటువంటి ఎత్తరి మాధవి సాయికుమార్ దంపతులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఆదివారం నిజామాబాదులోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడి, ఎమ్మెల్యేను స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మొదటి విడతల్లో సర్పంచ్ ఎన్నికల్లో గెలిచినటువంటి సర్పంచ్ ఎత్తరి మాధవి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా చేపట్టేందుకై ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆమె తెలిపారు. అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోబిన్ ఖాన్ మాజీ సర్పంచ్ జావిద్, కాంగ్రెస్ నాయకులు సాయిలు, దరంబీర్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

## శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల అభివృద్ధికి చర్యలు

**సూర్య- భిక్కనూరు**



మండల కేంద్రంలోని ప్రథమ విద్యాలయమైన శ్రీ సరస్వతి విద్యా మందిర్ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని,రాష్ట్ర సరస్వతీ విద్యాపీఠం ప్రతినిధులు, గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భారతీయ సంస్కృతికి చిహ్నాలు అయిన శ్రీ సరస్వతి విద్యా మందిరాలను అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందన్నారు. పాఠశాల ప్రబంధకారిణి తోపాటు ఇతర అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీఠం ప్రతినిధులు హరిస్మరణ రెడ్డి, డాక్టర్ శ్యాంసుందర్, రాజిరెడ్డి, గజ్జల బిక్షపతి, నంద రమేష్, అతిమాముల శ్రీధర్, అందే మహేందర్ రెడ్డి, పురం రాజమౌళి, బోడ నరేష్, వినోద్ కుమార్ గౌడ్, బండి సుధాకర్, సందుగారి రవీందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, బల్యాల వెంకట నరసింహులు, జిల్లెల్ల లింగారెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## బీపీ షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు

**సూర్య వేల్పూర్**



వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామంలో మండల ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో షుగర్ బిపి వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. వ్యాధి నిర్ధారణమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం శ్రీలత మాట్లాడుతూ భవిష్యత్తులో షుగర్ బీపీని తగ్గించుకోవడానికి చేయవలసిన పద్ధతులను తెలియజేశారు. అదేవిధంగా ఎన్సీడీ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. నెలసరి సూదులను చిన్నపిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ చిన్నరాజు, వనజ తదితరులు పాల్గొన్నారు.

# దాదా... ప్రజల మనిషిగా గుర్తింపు

## - దేశాయిపేటలో రసవంతంగా రాజకీయాలు

**సూర్య బాన్సువాడ.**

బాన్సువాడ మండలం దేశాయి పేట గ్రామానికి చెందిన భూనేకర్ ప్రకాష్ బాన్సువాడ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. గతంలో సర్పంచ్‌గా, ఎంపీపీగా, ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువగా ఉంటూ పాలన సాగించిన ఆయనపేరు ప్రకాష్ అయినప్పటికీ నియోజక వర్గం అంతటా "దాదా" అనే ఆప్యాయ నామంతో ప్రసిద్ధి చెందారు. మృదు స్వభావం, అందరితో కలిసిపోయే మనస్తత్వం వల్ల ప్రజల్లో ఆయనకు ప్రత్యేకమైన ఆదరణ ఉంది.పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భూనేకర్ ప్రకాష్ సతీమణి భూనే కర్ జ్యోతి దేశాయిపేట గ్రామ



సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు.గతంలో ఆమె గ్రామ సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉండటంతో పాటు, ప్రజలతో సత్సం బంధాలు కొనసాగిస్తూ విశ్వాసాన్ని సంపాదించారు. ప్రచారంలో గ్రామస్తులు ఆమెకు బ్రహ్మరథం పడుతూ ఉత్సాహంగా మద్దతు తెలుపుతున్నారు. దీనికి తోడు దాదా భార్యగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది.గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న భూనేకర్ జ్యోతి,రానున్న ఎన్నికల్లో కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరుతూ ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. ఒకవైపు ఆమె భర్త భూనేకర్ ప్రకాష్‌కు ఉన్న ప్రజాభిమానం, మరోవైపు జ్యోతి రాజకీయ చతురత, అనుభవం ఈ రెండు అంశాలు ఈ ఎన్నికల్లో వారికి కలిసొచ్చే అవకాశాలుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దేశాయిపేటలో ఎన్నికలవాతావరణంరోజురోజుకూ మరింత రసవంతంగా మారుతోంది.

## సర్పంచ్ అభ్యర్థికి ఆర్థిక సహాయం

**సూర్య,భీమ్‌గల్**



సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థులు వచ్చి ఏమిస్తారు అని చూసే ఓటర్లు ఉన్నారు. కాని అందుకు భిన్నంగా కొన్ని సంఘటనలు స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిపిస్తున్నాయి. భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ గ్రామ సర్పంచ్ గా గ్రామానికి చెందిన మధ్యతరగతి కుటుంబానికి చెందిన మారిపెద్ది మీనా, గణేష్ సర్పంచ్ గా పోటీలో ఉన్నారు. వీరికి బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా నిలిచింది. డబ్బులు, మద్యం, విందులు ఇచ్చే పరిస్థితి లేని మీనా కు స్థానికులు అండగా నిలుస్తున్నారు. మీనా భర్త గణేష్ మిత్రులు, బంధువులు ఇప్పటికే అన్ని విధాలుగా అండగా నిలుస్తూ ప్రచారం లో పాల్గొంటున్నారు. మీనా, గణేష్ లు ప్రజా సేవ చేసే లక్ష్యం తో ముందుకు రావడం, ఆర్థిక పరిస్థితి గమనించిన గ్రామానికి చెందిన ఒడ్యాల లక్ష్మణ్ ఆదివారం రు పది వేయిలు ఆర్థిక సహాయాన్ని సర్పంచ్ అభ్యర్థి భర్త గణేష్ కు అందజేశారు. ఈ సందర్బంగా సర్పంచ్ గా గెలిచి గ్రామానికి నిస్వార్థంగా పని చేయాలని సూచించారు. గ్రామస్తులు తనకు అండగా నిలవాలని ఈ సందర్భంగా మీనా గణేష్ ప్రజలను కోరారు.

## అవినీతి తావులేకుండా అభివృద్ధి చేస్తా

**సూర్య,భీమ్‌గల్**



తనకు అవకాశమిస్తే మూచ్కూర్ గ్రామాన్ని అవినీతి తావులేకుండా అభివృద్ధి పథంలో నడిపిస్తానని ముచ్కూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఒరగంటి (డిష్) గంగాధర్ అన్నారు.ఆదివారం మూచ్కూర్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో వేగం డిష్ గంగాధర్ కి రోజురోజుకూ ప్రజల మద్దతు మరింతగా పెరుగుతోంది. గ్రామ ప్రజల సమక్షంలో అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల్ని పలకరించిన ఈ ప్రచార యాత్రకు స్థానిక యువత భారీగా తోడయ్యారు.గ్రామంలో రెండు సార్లు ఉప సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం డిష్ గంగాధర్ కు బలం గా ఉంది. గ్రామం కోసం పని చేసే నాయకుడి అవసరం ఇప్పుడు ఎక్కువ. గతంలో చేసిన సేవే నా ఆయుధమన్నారు. మళ్లీ అవకాశం ఇస్తే.. ముచ్కూర్ గ్రామ అభివృద్ధిని కొత్త దిశలో తీసుకెళ్తానని గంగాధర్ ప్రజలకు భరోసా ఇస్తున్నట్లు ప్రచారంలో పాల్గొన్న వారు చెబుతున్నారు. ప్రచారం సాగిన ప్రతి వీధిలో ఆయనకు అనూహ్య స్పందన లభించింది. యువత ఎక్కడ చూసినా.. డిష్ గంగాధర్ కి భరోసా తెలిపేలా ప్రచారంలో ముందుండడం ప్రత్యేకంగా కనిపించింది. మహిళలు, పెద్దలు పలకరించి ఆశీర్వదించడం ప్రచారానికి మరింత జోష్ పెరిగింది.తమ అమూల్యమైన ఓటు లేడీస్ పర్స్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి డిష్ గంగాధర్ వెంట తన అభిమాన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా లక్షద్వీప్ ఎన్సిసి క్యాంప్ కి ఎంపికైన విద్యార్థిని

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని వైష్ణవి ఆల్ ఇండియా లక్షద్వీప్ ఎన్సిసి క్యాంప్ కి ఎంపికయింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి 11 మంది విద్యార్థులు ఎంపిక కాగా, అందులో వైష్ణవి ఎంపిక కావడంతో ఆదివారం గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు ఉదయ్ శర్మ వైష్ణవిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తన వార్డుకి సంబంధించిన అమ్మాయి ఆల్ ఇండియా లక్షద్వీప్ క్యాంప్ కి సెలక్ట్ కావడం గ్రామానికి ఎంతో గర్వకారణం అన్నారు. నేటి యువతులకు వైష్ణవిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మద్ది స్వామి,మాజీ సర్పంచ్ సిద్దరాములు,మాజీ ఉపసర్పంచ్ మల్లేశం నారాయణ,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గౌరీగారి రాజిరెడ్డి,నారాయణ తదితరులు పాల్గొన్నారు

## 35 ఏళ్ల తర్వాత మున్నూరు కాపు వర్గానికి సర్పంచ్ పదవి

**రాజంపేట సూర్య**



రాజంపేట గ్రామ రాజకీయ చరిత్రలో ఒక విశేష ఘట్టంగా, 35 సంవత్సరాల అనంతరం మున్నూరు కాపు వర్గానికి సర్పంచ్ పదవి దక్కడం పట్ల గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 2025లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో దుబ్బని శ్రీకాంత్ సర్పంచ్‌గా విజయం సాధించడంతో మున్నూరు కాపు సమాజంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా పలువురు మున్నూరు కాపు నాయకులు, గ్రామ పెద్దలు శ్రీకాంత్‌ను అభినందిస్తూ ఆయన విజయాన్ని చారిత్రాత్మకంగా అభివర్ణించారు. రాజంపేట గ్రామంలో 1990 సంవత్సరంలో కాసం బాగయ్య అనే మున్నూరు కాపు నాయకుడు సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత, మళ్లీ ఈ వర్గానికి అవకాశం రాలేదని వారు గుర్తు చేశారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా కొనసాగిన రాజకీయ నిరీక్షణకు ఇప్పుడు ముగింపు పలికిందని తెలిపారు. దుబ్బని శ్రీకాంత్ విజయం కేవలం వ్యక్తిగత విజయం కాకుండా, మున్నూరు కాపు సమాజానికి లభించిన గౌరవంగా భావిస్తున్నామని అలాగే, శ్రీకాంత్ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజయం గ్రామంలో సామాజిక సమతుల్యతకు, సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. మున్నూరు కాపు సమాజానికి ఈ విజయం ఒక వరంగా నిలుస్తుందని పలువురు అన్నారు.

## లింగంపేటలో ప్రశాంతంగా ముగిసిన సర్పంచ్ ఎన్నికలు

### -పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**సూర్య,లింగంపేట్**



లింగంపేట్ మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఆదివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు.పోలింగ్ కేంద్రానికి వచ్చిన వృద్ధ ఓటర్లతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ తమ ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధ ఓటర్‌ను అభినందించి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. యువకులు, వృద్ధులు ఓటు హక్కు వినియోగించడం ఎంతో అభినందనీయమని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని అబ్జర్వర్లకు సూచించారు.వీరి వెంట సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో పార్థ సింహారెడ్డి,ఎంపీడీవో నరేష్,వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## వేల్పూర్ లో ఎమ్మెల్యే పరామర్శ

**సూర్య వేల్పూర్**



వేల్పూర్ కు చెందిన తలారి అనంతరావు చనిపోయినందున ఆయన కుమారుడు అనిల్ మరియు కుటుంబ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం సాయంత్రం పరామర్శించారు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చనిపోయిన అనంతరావు మాజీ ఎంపీపీ నీరడి భాగ్యకు బావ అవుతాడు.

## నా జీవితం ప్రజల సేవకే అంకితం

### - కాంగ్రెస్ అభ్యర్థి విశ్రాంత ఉపాధ్యాయుడు మేకల విట్టల్

**సూర్య,బీర్కూర్.**



నా జీవితం గ్రామ ప్రజల సేవకే అంకితమని విశ్రాంత ఉపాధ్యాయుడు కాంగ్రెస్ అభ్యర్థి మేకల విట్టల్ తెలిపారు. ఆదివారం ఇంటింటికి వెళ్లి ఓట్ల ప్రచారంలో భాగంగా రిమోట్ గుర్తుకు ఓటు వేసి భారీ విజయాన్ని అందించాలని ఆయన తెలిపారు. గ్రామంలో నెలకొన్నటువంటి సమస్యలను పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాసుల బాలరాజ్ సహకారంతో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందడమే తన ముఖ్య ఉద్దేశమని ఆదర్శ గ్రామంగా, ఉత్తమ గ్రామ పంచాయతీగా మన గ్రామాన్ని నిలబెట్టడమే తన మొదటి కర్తవ్యం అని ఆయన తెలిపారు . ఆయన వెంట మాజీ ఎంపీపీ రఘు, విజయ్ ప్రకాష్, నాయకులు బసవరాజ్, గంగాధర్, రాజు, కిరణ్ తదితరులు ఉన్నారు.

## విద్యావంతులను ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధి చెందుతుంది

### -మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి

**సూర్య,బీర్కూర్**

ఉత్తమ విద్యావంతులను ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కిష్టాపూర్ గ్రామంలో బుజ్జముల భారతి భాస్కర్ ను బారి మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలందరూ ఫుట్ బాల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో విద్యావంతులైన బుజ్జంల భారతి భాస్కర్ ను ఎన్నుకోవాలని ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేపట్టబోయే అభివృద్ధి పనులను ముందే తెలిపి ప్రచారం నిర్వహిస్తున్నారని ఏ ఒక్క హామీ నెరవేర్చకున్న సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని తెలపడం చాలా గొప్ప విషయమని, అటువంటి వ్యక్తి నీ ఎన్నుకోవడం మన ముందున్న కర్తవ్యం అని ఆయన తెలిపారు. భారతీ భాస్కర్ ను గెలిపిస్తే గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకువస్తే సమస్యలను దగ్గరుండి పరిష్కరిస్తారని ఆయన తెలిపారు. గ్రామంలో ఉన్నటువంటి భారడి పోచమ్మ గుడిని ఎంపీ నిధులతో అభివృద్ధి పరుస్తానని ఎల్లవేళలా గ్రామ అభివృద్ధికి సహకరిస్తానని ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు కమలాకర్ రెడ్డి, పుల్లేని బాబురావు, గంగాధర్, నర్సారెడ్డి, అయినాల సాయిలు, మాణిక్యం తదితరులు ఉన్నారు.



# ప్రశాంతంగా రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో 86.08 శాతం పోలింగ్ నమోదు

**- జిల్లా కలెక్టర్**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా కామారెడ్డి జిల్లాలోరెండవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికలలో అత్యధికంగా 86.08 శాతం పోలింగ్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. 2 వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా అదివారం రెండవ విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి



నియోజక వర్గంలో జరిగిన 7 మండలాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పరిశీలించారు. 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 మొదటి విడతలో ఎల్లారెడ్డి నియోజక వర్గంలో ఏడు మండలాలైన గాంధారి, లింగం పేట, మహ్మద్ నగర్, నాగిరెడ్డి పేట్, నిజాం సాగర్, పిట్లం, ఎల్లారెడ్డిమండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. ఓటర్లు164301పురుషులు 78476 స్త్రీలు. 85822 ఇతరులు3 ఇందులోఓటు హక్కువినియోగించుకున్న ఓటర్లుమొత్తం. 141424 పురుషులు 67768 స్త్రీలు. 73656మొత్తం. 86.08% పురుషులు 86.36 % స్త్రీలు85.82 % నమోదు అయినట్లు వారు తెలిపారు.

# ప్రశాంతంగా పోలింగ్.....

**- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు - శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు**

**- విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు -జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

కామారెడ్డి జిల్లాలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తిస్థాయిలో ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ముందస్తుగా పటిష్టమైన భద్రతా బందోబస్తును ఏర్పాటు చేసి నట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కౌంటింగ్ కేంద్రాలను సందర్శిస్తూ ఓట్లు లెక్కింపు కొనసాగుతున్న ప్రక్రియ దృష్ట్యా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మహమ్మద్‌నగర్ మరియు లింగంపేట్ కౌంటింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ భద్రతా చర్యలు, కౌంటింగ్ హాల్స్‌లో అమలవుతున్న నిబంధనలు,



ప్రవేశ -నిష్క్రమణ విధానాలను సమగ్రంగా పరిశీలించారు. కౌంటింగ్ ప్రాంగణంలో అనుమతి పొందిన వ్యక్తులు మాత్రమే ఉండేలా కఠిన తనిఖీలు చేపట్టాలని, కౌంటింగ్ సమయంలో ఎలాంటి గొడవలు, అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ స్పష్టమైన సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్స్‌ను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామాల్లో, శాంతిభద్రతలకు భంగం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదని స్పష్టం చేస్తూ, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అభ్యర్థులు ఎన్నికల నియమాలను పాటిస్తూ, శాంతియుత వాతావరణం కొనసాగేందుకు పోలీస్ శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ . రాజేష్ చంద్ర కోరారు.

## పోలింగ్ సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

**- అదనపు కలెక్టర్ విక్టర్**

**సూర్య , నాగిరెడ్డిపేట్**



నాగిరెడ్డిపేట మండలంలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని పోచారం, మాల్ తుమ్మెద, తాండూర్, ధర్మారెడ్డి గ్రామాలలో పోలింగ్ కేంద్రాలతో పాటు, గోపాల్ పేట్ లోని రిసెప్షన్ సెంటర్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ.. మండలంలో 88.69 శాతం నమోదైయినట్లు తెలిపారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలు ఉండగా 6 గ్రామపంచా యతీలలో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడగా 21 గ్రామపంచాయతీలలో 19 వేల 506 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన తెలిపారు. ఎన్నికల రిపోర్టింగ్ సకాలంలో అందించాలని, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ రాజేశ్వర్, ఆర్ ఐ మొహమ్మద్ తదితరులు ఉన్నారు.

## తిప్పాపూర్ గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని తిప్పాపూర్ గ్రామాభివృద్ధికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కుంట లింగారెడ్డి కృషి చేయాలని, మండలంలోని రామేశ్వర్ పల్లి మాజీ గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తక్కల్ల నరసారెడ్డి చెప్పారు. ఆదివారం తిప్పాపూర్ గ్రామంలో సర్పంచ్ కుంట లింగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన రెండవ విడత పోలింగ్

**- రెండు గంటలకు ప్రారంభమైన కౌంటింగ్**

**- జిల్లా కలెక్టర్ఆశీష్ సంఘ్వాన్**

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఎన్నికలలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధ ఓటర్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వారితోమాట్లాడారు. ఈ సందర్భంగా వృద్ధులతో మాట్లాడిన కలెక్టర్ ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వయస్సు, ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా ఓటు వేయాలని, ముఖ్యంగా యువతతో పాటు వృద్ధులు కూడా చురుకుగా ఎన్నికలలో పాల్గొనడం ఎంతో అభినందనీయమని అన్నారు. అనంతరం మధ్యాహ్నం 2.00 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ కేంద్రాలు ఎల్లారెడ్డి నియోజక వర్గం లోని లక్ష్మాపూర్ , లింగం పేట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి కౌంటింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఇందులో సబ్ కలెక్టర్ కిరణ్మయి RDO పార్థ నరసింహా రెడ్డి, పోలింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి

**సూర్య, నాగిరెడ్డిపేట్**



రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలో నూతనంగా ఏర్పాటైన చిన్న ఆత్మకూర్ గ్రామ పంచాయతీలో ఆదివారం పోలింగ్ శాంతియుతంగా జరిగింది. గ్రామ పంచాయతీలోని నాలుగో వార్డుకు చెందిన పోలింగ్ బూత్‌లో మాజీ జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థానిక మాజీ జెడ్పిటిసి ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు భార్య పవిత్ర, కుమారులు సచిత్ రెడ్డి, నిచిత్ రెడ్డి కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ఎన్నికల ద్వారా సరైన ప్రతినిధులను ఎన్నుకుంటేనే పల్లెల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టగా, ఉదయం నుంచే ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారన్నారు.

## ఒకే పార్టీ రెండు వర్గాలు నువ్వా నేనా

**సూర్య,బీర్కూర్.**



స్థానిక ఎన్నికలలో మూడో విడత ఎన్నికలను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా అభ్యర్థుల ప్రచారాలు ముమ్మరంగా సాగిస్తున్నారు. సోమవారం చివరి రోజు కావడంతో కుల సంఘాలతో లోలోపల ఎవరికి వారే మంతనాలు జరుపుతున్నారు. మీ కులానికి సంబంధించిన ఓట్లు మాకే మద్దతు ఇవ్వాలని హామీ తీసుకుంటూ, గెలిచిన తర్వాత సంఘాలకు కావలసినటువంటి పనులను చేస్తామని హామీ ఇస్తున్నారు. బీర్కూరు మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఒకే పార్టీ అయినా కాంగ్రెస్ నుండి ఇటు పోచారం వర్గం అభ్యర్థులు అటు ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం నువ్వా నేనా అన్నట్టుగా సాగుతుంది.

**ఏనుగు వర్గం అభ్యర్థులు లేని చోట బీఆర్ఎస్ కు మద్దతు**

కొన్ని గ్రామాలలో బిఆర్ఎస్ అభ్యర్థులకు ఏనుగు వర్గం మద్దతు ఇస్తున్నట్టు స్థానిక ప్రజలు గుసగుసలాడుతున్నారు. మేజర్ గ్రామపంచాయతీ అయినటువంటి బీర్కూరు గ్రామంలో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. గ్రామంలో బిఆర్ఎస్ అభ్యర్థికి ఏనుగు రవీందర్ రెడ్డి వర్గం సపోర్టు చేస్తుందని మండల ప్రజలు గుసగుసలాడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కొరకు ఇటు పోచారం అటు బిఆర్ఎస్ అభ్యర్థి కొరకు బాజిరెడ్డి బీర్కూర్లో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఏది ఏమైనాప్పటికీ సామాజిక వర్గాల ఓట్లు మాకే కలిసి వస్తాయని ధీమాతో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా నిలబడినటువంటి వ్యక్తి వారి సామాజిక ఓట్లపై ధీమాతో నేనే గెలుస్తాను అని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ బీర్కూరు పీఠాన్ని అధిరోహించేది మాత్రం ప్రజలు వేసే ఓటు పైనే ఆధారపడి ఉంది.

## రెండవ విడుత ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లు

**- పోలింగ్ సరళిని పరిశీలించిన పోలీస్ కమీషనర్**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి..**

రెండవ విడత ఎన్నికలలో భాగంగా మొగుపాల్ , డిచిపల్లి మండలంల కేంద్రం లోని కంజర, కులాస్పూర్ , ఘన్పూర్ , ధర్మారం (బి) గ్రామాల లోని జిల్లా పరిషత్ హై స్కూల్ పోలింగ్ కేంద్రలను సందర్శించిన పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు , భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని , సిబ్బంది అధికారులు అప్రాతంగా ఉండాలని సూచించడం జరిగింది. ప్రజలు శాంతి యూత వాతావరణం లో తమ ఓటు హక్కు ను సద్వినియోగం పర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏ.సి.పి రాజా వెంకటరెడ్డి, సీఐ చందర్ రాథోడ్ ఎస్సైలు మహేష్ ఆరిఫ్ సుమలత , ఆర్మో అధికారులు శ్రీనివాస్ , షేక్ మస్జిద్ , రాజ నరసయ్య , మధుసూదన్ మరియు అధికారులు గలరు.



### భారీ మెజార్టీతో నుస్తులాపూర్ సర్పంచ్‌గా

# తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావు విజయం

- గ్రామ అభివృద్ధి ప్రధాన లక్ష్యం... - నుస్తులాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తయారు చేస్తాం...
- రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతాం... - గెలిపించిన ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు...
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తాం...
- నుస్తులాపూర్ సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావు...

**సూర్య, తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామ సర్పంచ్‌గా తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావు భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆది వారం రాత్రి వరకు సాగిన ఓట్ల లెక్కింపులో 950 ఓట్ల మెజార్టీతో తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావు గెలుపొందారు. ఈ సందర్భంగా తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అండగా నిలిచి ఆశీర్వదించి మంచి మెజార్టీతో గెలిపించిన గ్రామస్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని ప్రజలందరికీ అందుబా టులో ఉంటూ నుస్తులాపూర్ గ్రామాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణ సహకారంతో పెద్ద ఎత్తున నిధులు



తీసుకొచ్చి గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తయారు చేస్తామని తెలిపారు. తమ విజయంలో నిరంతరం కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ నాయ కులు కార్యకర్తలు గ్రామస్తులు.. ప్రజలు అభిమానులు సన్నిహితులు, కుటుంబ సభ్యులు బంధుమిత్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి ఆకాంక్షల మేరకు అభివృద్ధి చేస్తామని సంధ్య శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాలోనే నుస్తులాపూర్ అంటే అభివృద్ధిలో పేరు మార్మోగేలా నిరంతరం ప్రజల పక్షాన ఉండి పనిచేస్తామని తెలిపారు. ప్రజలు ఎల్లవేళలా ఏ ఇబ్బంది ఉన్న సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. ప్రజలు చూపిన ఆదర అభిమానాలను జీవితంలో మర్చిపోలేని వారి సేవలోనే నిరంతరం పాటు పడతానని సంధ్యా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. నుస్తులా పూర్ సర్పంచ్ గా విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభి మానులు ప్రజలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సంధ్య శ్రీనివాసరావు తో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

## ధర్మారం మండలంలో ప్రశాంతంగా పోలింగ్

**సూర్య, ధర్మారం**

ధర్మారం మండలంలో పంచాయితీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆదివారం నాడు ప్రశాంతంగా ముగిసింది. ధర్మారం మండలం లో మొత్తం 42447మంది ఓటర్లు ఉండగా అందులో 20869మంది పురుషులు కాగా 21575 మంది మహిళలు. 3 ఇతరులు ఉన్నారు. ఆదివారం జరిగిన పోలింగు లో 82.88 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైనప్పటికి చలి ప్రభావంతో ఓటర్లు రాకపోవడం తో 9 గంటల నుండి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లతో సందడి నెలకొంది. మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్లు లెక్కింపు మొదలు పెట్టిన అధికారులు ఫలితాలు వెల్లడించారు మండలం లోని నాయకం పల్లి శైనేని రవి .బొట్లవనపర్తి సంఘ రంజిత్ .రామ య్యపల్లి గ్రామ సర్పంచ్ గా మూల మంగ (బీ ఆర్ ఎస్). పైడిచింతలపెల్లి సున్నం రాజయ్య (kangres),గోపాల్ రావుపేట శంకసాని సౌజన్య (బి ఆర్ ఎస్),చామనాపెల్లి. వేల్పుల రేవతి (కాంగ్రెస్) కమ్మరిక్షణపేట తండా. లేవుద్య వాగ్యనాయక్,బుచ్చయ్య పల్లె. నేరెళ్ల వంశిక (కాంగ్రెస్),కటికేనపెల్లి చేపూరి లచ్చయ్య. (కాంగ్రెస్), కానం పెల్లి. కాల్వ సుగుణ. (కాంగ్రెస్),సాయంపేట. కూన శ్రావణి. (కాంగ్రెస్),పెరుకపల్లె గొల్ల క్రిష్ణా. బొమ్మారెడ్డి పల్లి. దార రాజు. రచ్చపెల్లి. సూర రజిత (కాంగ్రెస్). మల్లాపూర్ మంద శ్రీనివాస్. నర్సింగాపూర్ బంగుటపు కొమురయ్య. పత్తిపాక మందాల శ్రావణి . ధర్మారం ద్యాగేటి రాజేశ్వరి. కొత్తూరు భూక్యా సంగీత. కొత్తపల్లె బానోతు రాజానాయక్. న్యూ కొత్తపల్లి నందల మల్లేశంలు సర్పంచులు గా గెలుపొందారు.

## పంచాయతీలో పై చేయి... కాంగ్రెస్ దే...

- కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల హవా
- గట్టి పోటీ ఇచ్చిన గులాబీ పార్టీ మద్దతుదారులు
- పలు గ్రామాలలో సత్తా చాటిన స్వతంత్రులు

**సూర్య , నాగిరెడ్డి పేట్**

నాగిరెడ్డిపేట్ మండలంలో హోరాహోరీగా సాగిన రెండు విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది..ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఎక్కువ సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. బీఆర్ఎస్ తక్కువ సర్పంచ్ స్థానాలను గెలుచుకుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. దీంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. ఈ రెండు పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేశారు. వారం రోజు ల పాటు ప్రచారాన్ని హోరెత్తించారు. పెద్ద మొత్తంలో ఎన్నికల్లో ఖర్చు చేశారు. కీలకమైన కులసంఘాలు, యువతను ఆకట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు.

**- 8 స్థానాల్లో కాంగ్రెస్ విజయం..**

**- విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ గ్రామ సర్పంచ్‌ల వివరాలు..**

1) చినూర్ గ్రామ సర్పంచ్ గా కంచనపల్లి మురళీమోహన్ గౌడ్,
2) పోచారం సర్పంచ్ గా నిరుడి సంజీవ్ రావు,
3) బొల్లారం సర్పంచ్ గా పెద్దయ్య గారి ప్రభు గౌడ్,
4) గోలి లింగాల సర్పంచ్ గా బుర్రకాయల రోజా,
5) జలాల్పూర్ సర్పంచ్ గా నిజాంపేట శ్రీనివాస్ గౌడ్,
6) లింగంపల్లి కలాం సర్పంచ్ గా తడకంటి అనిత,
7) మాటూర్ సర్పంచ్ గా బిస్త భాగ్యశ్రీ,
8) జప్తి జనకంపల్లి సర్పంచ్ గా అక్కం వర్షిని,

**- 5 స్థానాల్లో బీఆర్ఎస్ విజయం..**

**- విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ సర్పంచ్ ల వివరాలు..**

1) గోపాల్ పెట్ గ్రామ సర్పంచ్ గా రాఘవపల్లి వంశీకృష్ణ గౌడ్,
2) చిన్న ఆత్మకూర్ సర్పంచ్ గా మిద్దంటి అనిత,
3) ధర్మ రెడ్డి సర్పంచ్ గా గుల్లపల్లి లక్ష్మి,
4) కన్నా రెడ్డి సర్పంచ్ గా పామగల సాయిలు,
5) వాడి సర్పంచ్ గా పోచమ్మల మహేందర్,

**- 1 బిజెపి స్థానం విజయం..**

1) బేగం చెరువు తండా సర్పంచ్ గా మలవత్ భాస్కర్,

**- 6 స్థానాల్లో స్వతంత్రులు..**

1) ఆత్మకూర్ గ్రామ సర్పంచ్ గా ఉమ్మన గారి లక్ష్మి,
2) బంజారా తండా ముదురు నరేష్,
3) మాల్ తుమ్మెద సర్పంచ్ గా ఉప్పల సాయిలు,
4) మెల్లికుంట తండా సర్పంచ్ గా రమావత్ బాల్య,
5) వదల్ పర్తి సర్పంచ్ గా సత్య బోయిని పద్మ,
6) రాఘవపల్లి సర్పంచ్ గా నీల గంగమణి,

మండలంలో ఆయా గ్రామాల్లో మెజారిటీ సర్పంచ్ స్థానాలు సాధించిన కాంగ్రెస్ పార్టీ, గట్టి పోటీ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు. కమలం పార్టీ మద్దతుదారులు ఈ ఎన్నికల్లో ఖాతా తెరవలేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ మండలంలో పంచాయతీ ఎన్నికలకు వచ్చే సరికి ఆ స్థాయి. లో సత్తా చాటలేకపోయింది. మరోవైపు ఏ పార్టీ మద్దతు లేకుండా సొంతంగా బరిలోకి దిగిన స్వతం త్రులు 6 చోట్ల విజయం సాధించడం గమనార్హం. ఆయా గ్రామాల్లో అభ్యర్థికి ఉన్న మంచి పేరుతో విజయం సాధించినట్లయింది. గ్రామాల ప్రజలు పార్టీలకు అతీతంగా స్వతంత్ర అభ్యర్థిని గెలిపించడం గమనార్హం.

## ప్రజాసేవకు అండగా నిలబడండి

- పోచారం భాస్కర్ రెడ్డి.

**సూర్య బాన్సువాడ రూరల్**



గ్రామ అభివృద్ధి, ప్రజాసేవనే లక్ష్యంగా పనిచేయగల నాయకత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి సూచించా రు. బాన్సువాడ మండలం తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి మంచి చేసే ఆశయంతో ముందుకు వస్తున్న మ్యాడ అనసూయ గోపాల్ రెడ్డిని ఉంగరం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపు నిచ్చారు.ఆదివారం తిరుమలా పూర్ గ్రామంలో మ్యాడ అనసూ యకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ,గ్రామానికి ప్రశాంతమైన, సమన్వ యపూర్వక పాలన అవసరమని అన్నారు. గతంలో గ్రామంలో జరిగిన వివాదాలు, పంచాయతీల పేరుతో మధ్యవ ర్తిత్వాలు, వాటి వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, మళ్లీ అలాంటి పరిస్థి తులు రావద్దన్నదే ప్రజల ఆకాంక్షగా మారిందని తెలిపారు.గ్రామాన్ని విడదీసే రాజకీయాలు కాకుండా, అందరినీ కలిపే నాయకత్వం కావాలని ప్రజలు కోరుకుంటున్నా రని భాస్కర్ రెడ్డి అన్నారు. పదవుల కోసం కాదు, సేవ కోసం ముందుకు వచ్చిన అభ్యర్థికే ప్రజలు అవకాశం ఇవ్వాలన్న భావన గ్రామమంతా వ్యక్తమ వుతోందని చెప్పారు. ఈ క్రమంలో వివాదా లకు దూరంగా ఉండే కుటుంబంగా గుర్తింపు ఉన్న అనసూయమ్మ గ్రామ పాలన కు సరైన ఎంపికగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు.మ్యాడ అనసూయ కుటుంబం గత ముప్పై ఏళ్లుగా గ్రామ ప్రజల మధ్యే ఉంటూ సేవ చేస్తోం దని, ప్రజలకు ఎప్పుడూ అందు బాటులో ఉండే కుటుంబంగా మంచి పేరు సంపా దించుకుందని భాస్కర్ రెడ్డి అన్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆమె ఆలోచనలకు ప్రజలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ ఎన్నికలు వ్యక్తుల మధ్య పోటీగా కాకుం డా, గ్రామ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం అని పేర్కొన్న భాస్కర్ రెడ్డి, ప్రశాంతత, విశ్వాసం, అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి అనసూయమ్మను గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వెబ్ కాస్టింగ్ సెంటర్‌ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

**సూర్య రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికల సందర్భంగా క్రిటి కల్ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టిం గ్‌ను జిల్లా సమీకృత కార్యా లయాల సముదాయంలో సెంటర్ ద్వారా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదివారం పరిశీలించారు. ఇల్లంతకుంట, బోయినపల్లి, తంగళ్ళపల్లి మండ లాల్లో మొత్తం 195 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ కొనసాగుతుండగా, ఐడీఓసీలోని సెంటర్ ద్వారా పరిశీలించారు.సెంటర్ లోని సిబ్బందికి సూచ నలు చేశారు.పరిశీలనలో డీపీఓ షరీఫుద్దిన్, ఈడీఎం శ్రీనివాస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలింగ్ శాతం 84.41

**- మొత్తం 1,04,905 ఓట్లలో పోలైన ఓట్లు 88,553**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికల పోలింగ్ 84.41 శాతం నమోదు అయింది. బోయిన పల్లి, తంగళ్ళపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో ఆదివారం పోలింగ్ నిర్వహించారు. మూడు మండలాల్లో కలిపి మొత్తం 1,04,905 ఓట్లు ఉండగా, పోల్ అయ్యాయి. మధ్యా హ్నం ఒంటి గంట వరకు 84.41 శాతం పోలింగ్ నమోదు అయింది.

**-మండలాల వారిగా ఓటర్లు... నమోదు అయిన పోలింగ్ శాతం...**

ఇల్లంతకుంట మండలంలో మొత్తం ఓటర్లు 35,932 మంది ఉండగా, 30,584 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85.12శాతం నమోదు అయింది.బోయినపల్లి మండలంలో మొత్తం ఓటర్లు 30,505 మంది ఉండగా, 25,858మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 84.77 శాతం నమోదు అయింది.తంగళ్ళపల్లి మండలంలో మొత్తం ఓటర్లు 38,468 మంది ఉండగా, 32,111 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 83.47శాతం నమోదు అయింది.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండ లం మర్తనపేటలో మాజీ సర్పంచ్ గొట్టె రామచంద్రం తల్లి లక్ష్మీ ఇటీవల మర ణించిగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కుటుంబ సభ్యు లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షు డు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ వంశీ, సర్పంచ్ దీప, ఉప సర్పంచ్ పునీత్ ఉన్నారు.